# రామన్నకు జన నీరాజనం

- భారీగా తరలివచ్చిన ప్రజలు, పార్టీ శ్రేణులు
- ముస్తాబాద్‌లో సిరిసిల్ల బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి కేటీఆర్ రోడ్‌షో సక్సెస్



ముస్తాబాద్ మండల కేంద్రంలో నిర్వహించిన రోడ్‌షోకు పెద్ద ఎత్తున హాజరైన ప్రజలకు అభివాదం చేస్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్

సిరిసిల్ల, నవంబర్ 21: ముస్తాబాద్ మండల కేంద్రం లో సిరిసిల్ల బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి కేటీఆర్ రోడ్‌షో నిర్వహించగా, జనం నీరాజనం పట్టింది. దాదాపు 15 వేలకు పైగా తరలిరావడంతో రోడ్‌షో విజయవంతమైంది. ఈ క్రమంలో అమాత్యుడు రామన్న ముందుగా ముస్తాబాద్‌కు చేరుకోగానే బస్టాండ్ ప్రాంతంలో బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు ఘన స్వాగతం పలికారు. బస్టాండ్ నుంచి తెలంగాణ తల్లి విగ్రహం వద్దకు మంత్రి కేటీఆర్ ప్రచార రథంపై నుంచి ప్రజలకు అభివాదం చేశారు. ముస్తాబాద్ ప్రధాన రహదారిలో మంత్రి కేటీఆర్ ప్రచార రథం ఎదుట బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు 'దేఖ్‌లేంగో' పాటపై నృత్యం చేశారు. ప్రచార రథం ముస్తాబాద్ ప్రధాన కూడలిలో తెలంగాణ తల్లి విగ్రహం వద్దకు చేరుకొన్న తర్వాత మంత్రి కేటీఆర్ ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. మంత్రి కేటీఆర్ ప్రసంగం అందరినీ ఆకట్టుకున్నది. ముస్తాబాద్‌కు డిగ్రీ కళాశాల మంజూరు చేస్తానని మంత్రి కేటీఆర్ ప్రకటించడంతో ప్రజలంతా చప్పట్లతో స్వాగతం పలికారు. కోడళ్లకు సౌభాగ్యలక్ష్మి ఇస్తామని చెప్పడంతో మహిళలు సంతోషం వ్యక్తం చేశారు. రైతు బంధు వస్తుందా.. కరంట్ నిరంతరాయంగా ఉంటుందా.. అని మంత్రి కేటీఆర్ అడుగడంతో ప్రజలంతా వస్తున్నదని చెప్పారు. కారు గుర్తుకే ఓటేయాలని కోరగా, ప్రజలంతా పిడికిలి ఎత్తి మద్దతు ప్రకటించారు. రామన్నను చూసేందుకు, ఆయన ప్రసంగం వినడానికి ప్రజలు సమీప ప్రాంతాల్లోని భవనాలు ఎక్కారు. అనంతరం మంత్రి కేటీఆర్‌పై పూల వర్షం కురిపించారు. ప్రసంగం పూర్తికాగానే మంత్రి కేటీఆర్ ముస్తాబాద్ ప్రధాన రహదారి నుంచి ప్రజలకు అభివాదం చేస్తూ.. విజయ సంకేతం చూపుతూ దాదాపు కిలోమీటర్ వరకు వెళ్లి తన వాహనంలో తిరుగుపయనమయ్యారు.

### ఘనస్వాగతం పలికిన పార్టీ శ్రేణులు

ముస్తాబాద్ మండల కేంద్రానికి 4.25 గంటలకు మంత్రి కేటీఆర్ చేరుకోగా, ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు ఘనస్వాగతం పలికారు. స్థానిక బస్టాండ్ నుంచి ప్రచార రథం నుంచి ప్రజలకు అభివాదం చేస్తూ మంత్రి కేటీఆర్ తెలంగాణ తల్లి విగ్రహం ఎదుట ప్రజల నుద్దేశించి ప్రసంగించారు. అనంతరం సాయంత్రం 5.20గంటలకు తిరుగుపయనమయ్యారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, ఎంపీపీ జనగామ శరత్‌రావు, జడ్పీటీసీ గుండం నర్సయ్య, ఆర్‌బీఎస్ మండల కన్వీనర్ కల్వకుంట్ల గోపాల్‌రావు, సెస్ డైరెక్టర్ సందుపట్ల అంజిరెడ్డి, ఏఎంసీ చైర్మన్ అక్కరాజు శ్రీనివాస్, సర్పంచ్ గాండ్ల సుమతి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు బొంపల్లి సురేందర్‌రావు, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు ఎద్దండి నర్సింహారెడ్డి, సీనియర్ నాయకులు వెన్నమనేని పూర్ణచందర్‌రావు, వెన్నమనేని శ్రీనివాసరావు, డాక్టర్ చంద్రశేఖర్‌రావు, మేరుగు యాదగిరిగౌడ్, విజయరామారావు, సహకార సంఘం చైర్మన్ తన్నీరు బాపురావు, రాజేందర్‌రెడ్డి, సర్వర్‌పాషా, అన్వర్, కొమ్ము బాలయ్య, అంజన్‌రావు, బత్తుల అంజయ్య, సంతోష్‌రావు, శ్రావణ్‌రావు, సర్పంచుల ఫోరం మండలాధ్యక్షుడు కలకొండ కిషన్‌రావు, బీఆర్ఎస్ మహిళా విభాగం అధ్యక్షురాలు దబ్బెద రేణుక, నాయకులు మట్ట రాణి, కుర్ర సావిత్రి, శీలం జానాబాయి పాల్గొన్నారు.



ముస్తాబాద్ మండల కేంద్రంలో నిర్వహించిన మంత్రి కేటీఆర్ రోడ్‌షోకు పెద్ద ఎత్తున తరలివచ్చిన పార్టీశ్రేణులు, కార్యకర్తలు, అభిమానులు



ముస్తాబాద్‌లో మంత్రి కేటీఆర్ అభివాదం తెలుపుతున్న మహిళలు



ముస్తాబాద్‌లో జై కేటీఆర్ అంటూ నినదిస్తున్న యువకులు

# వేములవాడలో సీఎం బహిరంగ సభ

- స్థలాన్ని పరిశీలించిన రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్



వేములవాడ పట్టణంలోని బాలానగర్‌లో సీఎం కేసీఆర్ సభ ప్రాంగణ స్థలాన్ని పరిశీలించి పార్టీ శ్రేణులకు సూచనలు ఇస్తున్న ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్

వేములవాడ, నవంబర్ 21: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో సీఎం కేసీఆర్ ఈ నెల 26న వేములవాడ బహిరంగ సభకు హాజరుకానున్నారు. ఈ క్రమంలో మంగళవారం పట్టణంలోని బాలానగర్ వద్ద స్థలాన్ని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ పరిశీలించారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలో నిలిచిన చల్మెడ లక్ష్మీనరసింహారావును భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరేందుకు సీఎం కేసీఆర్ వేములవాడకు రానున్నట్లు తెలిపారు. ఈ మేరకు సభ ప్రాంగణం, హెలిప్యాడ్, పార్కింగ్ స్థలాలను పరిశీలించారు. వేములవాడ నియోజకవర్గం వివిధ ప్రాంతాల నుంచి వచ్చే వాహనాలను దృష్టిలో ఉంచుకొని ట్రాఫిక్ సమస్య ఏర్పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఏఎస్పీ చంద్రయ్యకు సూచించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకుడు న్యాలకొండ రాఘవరెడ్డి, మార్క్‌ఫెడ్ రాష్ట్ర డైరెక్టర్ బండ నర్సయ్య, కౌన్సిలర్లు నిమ్మశెట్టి విజయ్, మారం కుమార్, యాచమనేని శ్రీనివాసరావు, నరాల శేఖర్, సర్పంచులఫోరం మండల కన్వీనర్ ఏశ తిరుపతి, ఆర్‌బీఎస్ మండల కన్వీనర్ లైశెట్టి మల్లేశం, నాయకులు రామతీర్థపు రాజు, గూడూరి మధు, గన్నమనేని రామారావు, రాము, తిరుపతి, గోపు బాలరాజు, జోగినపల్లి అజిత్‌రావు, సంపత్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆశీర్వదించండి..
# అండగా ఉంటా

వెల్గటూర్, నవంబర్ 21: 'నేను మీ బిడ్డను. ఎన్నో ఏండ్ల నుంచి మీ సేవలోనే ఉన్నా. మీకు ఆపదొస్తే ఆదుకుంటా. కష్టమొస్తే తోడుగా నిలుస్తాన'ని ధర్మపురి బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి కొప్పుల ఈశ్వర్ ప్రజలకు భరోసానిచ్చారు. మంగళవారం వెల్గటూర్ మండలం కోటిలింగాలలో ప్రజా ఆశీర్వాద యాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా తమ గ్రామానికి వచ్చిన అమాత్యుడికి మహిళలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి ఈశ్వర్ మాట్లాడారు. కోటిలింగాలలో మిగిలిన పనులన్నీ చేస్తానని, సమస్యలు పరిష్కరిస్తానని చెప్పారు. ప్రజలకు తనకు మధ్య దాపరికాలు ఉండవద్దని, మధ్యవర్తులు, పైరవీలకు తావు లేకుండా నేరుగా తనకు ఫోన్ చేసి మీ సమస్యలు చెప్పాలని సూచించారు. మిమ్మల్ని తనకు దూరం చేయడంలో కొన్ని శక్తులు అడ్డుపడ్డాయని, అలాంటి వారిని దూరం పెట్టి నేరుగా తననే సంప్రదించాలని సూచించారు. మరొకసారి ఆశీర్వదించాలని, నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతానని చెప్పారు. ఈ సందర్భంగా కోటిలింగాల అర్చకుడు సంజీవ్ శర్మ కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన 100 మంది పద్మశాలి నాయకులు బీఆర్ఎస్‌లో చేరగా, కండువా కప్పి ఆహ్వానించారు. చేరిన వారిలో మాజీ సర్పంచ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు దాసరి సత్తయ్య, దాసరి భరత్, పరుష రమేశ్, దాసరి కోట య్య, రమేశ్, రాజ్‌కుమార్, ఎలగం గంగయ్య, ఎలుగం మల్లేశం, రాజ్‌కుమార్, చింతకింది రాజేశ్, మహేశ్, శంకరయ్య, అడగంట్ల తిరుపతి, రాజయ్య, నక్క రాయలింగు, జోగు రాజయ్య, ఎన్నం ఆశయ్య, రాపాక గంగయ్య, కోటయ్య, రామయ్య, రాపాక కోటయ్య, దాసరి శ్రీనివాస్ ఉన్నారు. కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షులు పర్ష కోటయ్య, ఏఎంసీ చైర్మన్ పత్తిపాక వెంకటేశ్, సర్పంచ్ నక్క మౌనిక-రవితేజ, బోడకుంటి రమేశ్, ఎంపీటీసీ రాజేశ్వరి ఉన్నారు.

## స్థానికేతరుడు కావాలా..?
# స్థానికుడు కావాలా..

- మీరే ఆలోచించుకోవాలి • నేను మీ బిడ్డను.. ఆశీర్వదించండి
- చొప్పదండి అభ్యర్థి సుంకె రవిశంకర్ • కొడిమ్యాలలో ప్రచారం



కొడిమ్యాలలో మాట్లాడుతున్న చొప్పదండి అభ్యర్థి, ఎమ్మెల్యే రవిశంకర్

కొడిమ్యాల, నవంబర్ 21: 'నేను మీ బిడ్డను. ఇక్కడే ఉంటా. మీ కోసమే పనిచేస్తా. కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు నాన్‌లోకల్. ఐదేండ్లకోసారి కనిపిస్తరు. నేనొక్కటే అడుగుతున్నా.. మీకు స్థానికేతరుడు కావాలా..? మీ మధ్యే ఉండే స్థానికుడు కావాలా..? ఆలోచించుకోవాలని' చొప్పదండి అభ్యర్థి సుంకె రవిశంకర్ ప్రజలకు పిలుపునిచ్చారు. మంగళవారం గోపాల్‌రావుపేట, అప్పారావుపేట, సండ్రల్లపల్లి, తిర్మలాపూర్, కోనాపూర్, దమ్మయ్యపేట, సూరంపేట, గంగారాంతండ, కొడిమ్యాల, పూడూర్‌లో ప్రచారం చేశారు. ఎన్నికలు వచ్చినప్పుడు మాత్రమే బీజేపీ, కాంగ్రెస్ నాయకులు కనిపిస్తారని, వాళ్లు మహానటులు అని, నమ్మితే మోసపోతారన్నారు. స్థానికులకే ఇక్కడి సమస్యలు తెలుస్తాయన్నారు. కాంగ్రెస్ 60 ఏండ్ల పాలనలో తెలంగాణకు చేసిందేమీ లేదని, 24 గంటల కరెంట్, రైతు బంధు, రైతు బీమా, కల్యాణ లక్ష్మి, ఆసరా పింఛన్లు ఎందుకు ఇవ్వలేదో చెప్పాలన్నారు. బీఆర్ఎస్ మ్యానిఫెస్టో ప్రజలకు ఎంతో మేలు చేస్తుందని, వచ్చే ఏడాది నుంచి ఆసరా పింఛన్ రూ.5వేలకు పెంచుతామని, రేషన్ దుకాణాల్లో సన్నబియ్యం ఇస్తామని, పేదింటి మహిళలకు నెలకు రూ.3వేల జీవనభృతి అందజేస్తామన్నారు. ఇంకా 400కే సిలిండర్ అందించనున్నట్లు చెప్పారు. కేసీఆర్ నాయకత్వమే రాష్ట్రానికి శ్రీరామ రక్ష అన్నారు. బీఆర్ఎస్ కార్యకర్తలు ఈ ఎనిమిది రోజులు శక్తి వంచన లేకుండా పనిచేయాలని, ఇంటింటికీ వెళ్లి మ్యానిఫెస్టోను వివరించాలన్నారు. సండ్రల్లపల్లి గ్రామానికి చెందిన 20 మంది యువకులు బీఆర్ఎస్‌లో చేరారు.